క్లుప్తంగా

అవయవదానం ప్రాణదానంతో సమానం



జూపూడి(ఇబ్రహీంపట్నం): అవయవదానం ప్రాణదానంతో సమానమని నిమ్రా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్ అన్నారు. జూపూడి నిమ్రా ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఫార్మసిస్ట్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులతో చికిత్స మాత్రమే చేయగలమని అవయవదానంతో ప్రాణం దానం చేయొచ్చని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మరో కార్యక్రమంలో నిమ్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల డీన్ బాబులాల్, డాక్టర్ ఫారూఖీ, అకడమిక్ డైరెక్టర్ టి.నారాయణమూర్తి పాల్గొని ప్రసంగించారు.

పాఠశాలకు టేబుల్స్, కుర్చీల వితరణ



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో కేతనకొండ ఎంపీపీ పాఠశాలకు కుర్చీలు, టేబుల్స్, మైక్‌సెట్ సోమవారం వితరణ చేశారు. సంస్థ డైరెక్టర్ ఎం.ఎలీషా మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సహకారం అందిపుచ్చుకుని ఇంజినీర్లు, డాక్టర్లు, ఐఏఎస్‌లుగా ఎదగాలన్నారు. అమెరికా దేశస్తులు నాథన్, లిండ్సే దంపతులు విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు అవసరమైన మౌలిక సదుపాయలు కల్పిండంలో తాము ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. దాతలను సత్కరించారు. ఎంఈఓ సీహెచ్ పుష్పలత, హెచ్‌ఎం ఝాన్సీరాణి , ఎంపీటీసీ సువర్ణరాజు, సీఆర్పీ డి.నాగేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ రాణి పాల్గొన్నారు.

30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

చాట్రాయి: మండలంలో ఈ నెల 30 నుంచి వచ్చేనెల 18వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నారు. 30న బూరుగుగూడెం, 3న చనుబండ 1, 5న చనుబండ 2, అక్టోబర్ 4న చిత్తపూరు 1, 6న చిత్తపూరు 2, 9న జనార్దనవరం, 10న చిన్నంపేట, 11న పోలవరం, 12న కోటపాడు, 13న తుమ్మగూడెం, 16న నరసింహారావుపాలెం, 17న కొత్తగూడెం, 18న పోతనపల్లి, 19న మర్లపాలెం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి తెలిపారు.

హీల్ విద్యార్థికి రజత పతకం



నూజివీడు(ఆగిరిపల్లి): ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అండర్–17 రాష్ట్రస్థాయి అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆగిరిపల్లి మండలం తోటపల్లి హీల్ స్కూల్ 10వ తరగతి విద్యార్థి ఎం.నాగ తిరుమల గోపి హేమర్ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.సాయిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు కోచ్ ప్రభుదాసు, సీఈవో కూరపాటి అజయ్‌కుమార్ తదితరులు అభినందించారు.

చెరువుల తవ్వకాలపై ఫిర్యాదు

తిరువూరు: తిరువూరు మండలంలోని మల్లేలలో ప్రభుత్వ భూముల్లో చేపల చెరువులను అక్రమంగా తవ్వుతున్నారని గ్రామస్తులు సోమవారం స్పందన కార్యక్రమంలో తిరువూరు ఆర్డీఓ ప్రసన్నలక్ష్మికి ఫిర్యాదు చేశారు. గతంలో కూడా గ్రామంలో ఇటువంటి చెరువు అక్రమ తవ్వకాలు జరిగాయని తెలిపారు. రీసర్వే నెం.147లో అక్రమ తవ్వకాలను అరికట్టాలని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫార్మసీ విద్యార్థుల ర్యాలీ



నూజివీడు: ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఔషధాలు సరైన మోతాదులో వినియోగం, మందులను జాగ్రత్త చేసే విధానం తదితర అంశాలపై ప్రజలను చైతన్యపరిచేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గుట్టా సుబ్బారావు తెలిపారు. మందుల వినియోగంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ర్యాలీ బస్టాండ్ సెంటర్ నుంచి చిన్న గాంధీబొమ్మ సెంటర్ వరకు సాగింది.

ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం

రూ. 81వేలు పలికిన కాపుల బజార్ గణనాథుని లడ్డూ

రెడ్డిగూడెం: గణపతి నవరాత్రుల్లో భాగంగా సోమవారం మండలంలోని పలు చోట్ల గణేష్ నిమజ్జనోత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. రెడ్డిగూడెంలో కాపుల బజార్‌లోని అంకమ్మ తల్లి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూ ప్రసాదం వేలం పాటలో అత్యధికంగా రూ. 81వేలు పలికింది. ఈ ప్రసాదాన్ని దాసరి పాండవులు వేలం పాట ద్వారా దక్కించుకున్నారు. కమిటీ సభ్యులు పాండవులను ఘనంగా సన్మానించి లడ్డూను అందజేశారు. రెడ్డిగూడెం శాలివాహనం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఘనంగా ఊరేగించి సమీపంలోని చెరువులో నిమజ్జనోత్సవం చేశారు. రెడ్డిగూడెం కాపుల బజార్‌లో జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి పాల్గొని వినాయకుని పూజలో కార్యక్రమాలు నిర్వహించారు.

రాజాపేటలో..

మైలవరం: వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని మైలవరం సీఐ మోహనరెడ్డి తెలిపారు. మైలవరం రాజాపేటలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన చలువ పందిట్లో సోమవారం కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయకుని నిమజ్జనం కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రతలు తీసుకున్నామన్నారు. భక్తులు సహకరించి చిన్నపిల్లలు, ఈతరాని వారు నిమజ్జనం కార్యక్రమానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై హరిప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ పామర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు. మైలవరం కోట వెనుక ఉన్న రామాలయం వద్ద వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వినాయకుని పందిరి వద్ద మహిళలు 2,100 ఒత్తులు శివలింగాకారంలో వెలిగించి ఆదివారం రాత్రి పూజలు నిర్వహించారు.



ప్రసాదం లడ్డూను రూ. 81 వేలకు సొంత చేసుకున్న దాసరి పాండవులు

పీటీకొత్తూరులో గణపతి కల్యాణం

తిరువూరు: తిరువూరు శివారు పీటీకొత్తూరు రామాలయంలో సోమవారం సిద్ధిబుద్ధి సమేత గణపతి కల్యాణం జరిగింది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధానార్చకులు ఈశ్వరప్రగడ విజయకుమార్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు స్వామి కల్యాణాన్ని జరిపించారు.

కనులవిందుగా..

గంపలగూడెం: వినాయక చవితి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గంపలగూడెం గాంధీ సెంటర్ వద్ద సిద్ధిబుద్ధి సమేత వినాయక స్వామి కల్యాణం సోమవారం రాత్రి కనులవిందుగా నిర్వహించారు. ఎనిమిదో రోజు వేడుకల్లో భాగంగా అర్చక బృందం సభ్యులు వివాహ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. 12 మంది దంపతులు పీటలపై కూర్చొని కన్యాదానం చేశారు. స్వామి వివాహ విశిష్టతను అర్చకులు ఈ సందర్భంగా వివరించారు.



తిరువూరు శివారు పీటీకొత్తూరు రామాలయంలో గణపతి కల్యాణం



మైలవరం రాజాపేటలో అన్నదానం చేస్తున్న సీఐ మోహనరెడ్డి, ఎస్సై హరిప్రసాద్



గంపలగూడెం గాంధీ సెంటర్లో వినాయక కల్యాణం

ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ జయంతి

నూజివీడు: జనసంఘ్ పూర్వ అధ్యక్షుడు, బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ నాయకులు సోమవారం మండలంలోని సుంకొల్లులో ఆ పార్టీ నూజివీడు మండల అధ్యక్షుడు గోగినేని శ్రీనివాస కుమార అప్పారావు నేతృత్వంలో నిర్వహించారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు నెక్కలపు కృష్ణారావు, అనమాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

నూజివీడు(ఆగిరిపల్లి): ఆగిరిపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు కొవ్వలి బాబూరావు ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఆ పార్టీ స్థానిక కార్యాలయంలో సోమవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రెడ్డి రామారావు పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: జనసంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని తిరువూరు నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. బీజేపీ నాయకులు నాళ్ల సురేష్, దేవిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, రామిశెట్టి రవి, అల్లాడి కృష్ణయ్య పాల్గొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: పండిట్ దీనదయళ్ ఉపాధ్యాయి జయంతిని సోమవారం గంపలగూడెంలో నిర్వహించారు. బీజేపీ జిల్లా బీసీ మోర్చా కార్యదర్శి కే గోపాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.యుగంధర్, పట్టణ అధ్యక్షుడు సూర్యప్రకాష్, నర్సింహారావు, మండలం మాజీ అధ్యక్షుడు క్రాంతికుమార్ పాల్గొన్నారు.



దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మైలవరంలో..

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఎన్టీఆర్ జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం ఎన్టీఆర్ జిల్లా యూత్ ఆఫీసర్ సుంకర రాము, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీ రంగారావు, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటింగ్ మెంబర్ బి.వినోద్‌కుమార్ పాల్గొన్నారు. మైలవరం బీజేపీ కార్యాలయంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రఘునాధరెడ్డి, నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'స్పందన'లో మూడు దరఖాస్తులు



గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తులు ఇచ్చినట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్నదానం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకులు, జనసంఘ్ సిద్ధాంతకర్త దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి కొండపల్లిలో జరిగింది. ఈ సందర్భంగా స్థానిక దివ్యాంగుల సేవా సంస్థలో బీజేపీ నాయకులు సోమవారం దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాధరెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి కుక్కపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ముసునూరు: అనారోగ్యం, ప్రమాదాల్లో సంఘ సభ్యులు అకాల మృతి చెందితే తమ సహకార సంఘం తక్షణ సాయంతో ఆ కుటుంబాన్ని ఆదుకుంటుందని వలసపల్లి సొసైటీ అధ్యక్షుడు దేవినేని సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇటీవల మృతి చెందిన సంఘ సభ్యుడు గుడిపాడుకు చెందిన అబ్దుల్ సత్తార్ కుటుంబానికి సహకార సంఘం, కేడీసీసీ బ్యాంకు తరపున రూ.10,000 సహాయాన్ని కుమారునికి సోమవారం సాయంత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ ఎం.రవిప్రసాద్, ఉప సర్పంచ్ డీవీ సుబ్బారావు, కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్పీ బాలుకు స్వర నివాళి

నూజివీడు: పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం రాత్రి గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యానికి స్వర నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు కళావేదిక, శ్రీ సత్య నృత్య సంగీత కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక గాయనీ గాయకులు పాల్గొని బాలసుబ్రహ్మణ్యం పాడిన గీతాలను ఆలపించి బాలును గుర్తు చేశారు. కళావేదిక నిర్వాహకులు పురాణం కృష్ణప్రసాద్ బాలసుబ్రహ్మణ్యం జీవిత విశేషాలను వివరించారు. అనంతరం గాయకులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. వాయిద్య సహకారం రాజు, నాని అందించారు. కార్యక్రమంలో శ్రీ సత్య నృత్య సంగీత కళాశాల అధినేత వేంపాటి మోహన్, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ గొల్లపూడి రవికుమార్ పాల్గొన్నారు.

కళాకారుల నివాళి

చెక్కపల్లి(ముసునూరు): పాటలకు తన గాన మాధుర్యంతో జీవం పోసి, అవార్డులు, రివార్డులతో పాటు మరెన్నో జాతీయ, స్థానిక పురస్కారాలందుకుని అభిమానుల హృదయాలలో నిలిచిన గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సదాస్మరణీయులని మండల పౌరాణిక నాటక కళాకారుల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కూసం మార్కండేయులు, బొల్లిన నాగరాజు పేర్కొన్నారు. చెక్కపల్లి సెంటర్‌లో సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం దివంగత సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలుకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాకారులు ఎం.గిరిబాబు నాయుడు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



పాటలు పడుతున్న గాయకులు

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ముసుకుళ్ల(తిరువూరు): మండలంలోని మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన నియోజకవర్గ స్థాయి పాఠశాలల క్రీడా పోటీల్లో గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వీరభద్రరావు తెలిపారు. ఖోఖోలో చరిష్మా, లావణ్య, మౌనిక, కబడ్డీలో కీర్తి, పరుగుపందెంలో లావణ్య, యోగాలో ఉమాశ్రీ, చంద్రశ్రీ, అక్ష, షాట్‌పుట్‌లో ప్రభాశ్రీ రెడ్డి గెలుపొందినట్లు తెలిపారు.



జిల్లా క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులు

మద్యం మత్తులో సోదరుడిపై కత్తితో దాడి

నూజివీడు(ఆగిరిపల్లి): మద్యం మత్తులో సోదరుడిపై కత్తితో దాడి చేసిన సంఘటన ఆగిరిపల్లి మండలం ఈదరలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన దేవరపల్లి మోషే, గురిజాల ఏసుదాసు ఇరువురు సోదరులు (అక్కచెల్లెళ్ల కుమారులు). అయితే వీళ్లిద్దరూ కలిసి మద్యం సేవించి ఆ తరువాత రూ.4 వేల విషయమై గొడవపడ్డారు. ఈ క్రమంలో మోషే కత్తితో ఏసుదాసుపై దాడి చేసి పొట్టలో పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఏసుదాసును హుటాహుటిన విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై ఎస్సై నంబూరు చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిరప రైతులను ఆదుకోవాలి

గంపలగూడెం: మండలంలో మిర్చి సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పగడాల వీరాంజనేయులు మాట్లాడుతూ మండలంలోని కనుమూరు, అనుముల్లంక తదితర గ్రామాల్లో దెబ్బతిన్న మిర్చి పొలాలను శాస్త్రవేత్తలు తక్షణమే పరిశీలించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. మండలంలో ఈ సంవత్సరం 12 వేల ఎకరాల్లో రైతులు మిర్చి పంటను సాగు చేశారన్నారు. మిర్చి వేసిన 20 రోజుల నుంచి మొక్కల్లో పెరుగుదల లేక ఎర్రబడిపోయాయని పైరును రక్షించుకునేందుకు రైతులు వివిధ రకాల మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోయిందన్నారు. దీంతో కొందరు రైతులు మిర్చి తోటలను తీసివేసి మళ్లీ కొత్త మొక్కలు వేస్తున్నారని పేర్కొన్నారు. కొందరు రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఒక్కొక్క రైతు ఎకరాకు రూ. 80వేల నుంచి రూ. లక్ష వరకు పెట్టుబడి పెట్టి ఉన్నారన్నారు. ఈ పరిస్థితులో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల శీతారామిరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మద్దిరెడ్డి వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు గుంటుపల్లి వీరభద్రం, నాళ్లా చిన్న సత్యంబాబు పాల్గొన్నారు

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

చిలుకూరు(ఇబ్రహీంపట్నం): మొక్కజొన్న పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.శైలజ పేర్కొన్నారు. చిలుకూరు గ్రామంలో సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ విజయవాడ వారి ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఫెరమోన్ ట్రాప్స్ వాడే విధానం, వాటి ఉపయోగాలు తెలియజేశారు. జీవశిలీంధ్రనాశనులు అయిన ట్రైకోడెర్మావిరిడి ఉపయోగాలు వివరించారు. రైతులకు పురుగులు పట్టే నెట్, పరిశీలించడానికి ఉపయోగించే లెన్స్, మందు పిచికారీ సమయంలో ధరించాల్సిన ఆప్రాన్, క్యాప్, కళ్లజోడు కలిగిన ఐపీఎం కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ సురేష్, ఏపీపీఓ ప్రేమా రంజితం పాల్గొన్నారు.



రైతులకు ఐపీఎం కిట్లు పంపిణీ చేస్తున్న ఏఓ శైలజ, ఏపీపీఓ ప్రేమారంజితం

నెమలి దేవస్థానం ఆదాయం రూ. 2.43 లక్షలు

నెమలి(గంపలగూడెం): నెమలి దేవస్థానంలో రెండు గదులకు అద్దె నిర్ధారించేందుకు నిర్వహించిన వేలం పాట ద్వారా ఏడాదికి రూ. 2,43,600 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ డి. శ్రీరామవర ప్రసాదరావు తెలిపారు. 3వ నంబర్ గదిని వంగల మల్లికార్జునరావు నెలకు అద్దె రూ. 3,700కు, 7వ నంబర్ గదిని బొల్లెపోగు చిన్న వెంకటేశ్వర్లు రూ. 16,600కు అత్యధికంగా పాడి కైవసం చేసుకున్నట్లు సహాయ కమిషనర్ పేర్కొన్నారు. రెండు గదుల మీద అద్దె రూపేణా ఆదాయం ఏడాదికి రూ. 2,43,600 వస్తుందని తెలిపారు. షేర్ మహమ్మద్ పేట గ్రూపు దేవాలయాల ఈఓ సీహెచ్ దుర్గా నాగేశ్వరరావు పర్యవేక్షణలో వేలం పాట నిర్వహించారు.



నెమలి దేవస్థానంలో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

కృత్రిమ అవయవాలతో ఆత్మస్థైర్యం

నూజివీడు(ఆగిరిపల్లి): దివ్యాంగులు స్వచ్ఛంద సంస్థలు అందజేస్తున్న కృత్రిమ అవయవాల సాయంతో ఆత్మస్థైర్యం పెంపొందించుకుని సాధారణ జీవితం కొనసాగించాలని ప్రముఖ వ్యాపారవేత్త వేగే శ్రీనివాసరావు అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో మచిలీపట్నం స్టార్ కళాశాల అధినేత పెర్నేటి రాంప్రసాద్ ఆర్థిక సాయంతో తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన సీతా గణేష్, వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన గుండు గంగాదేవి, ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం పిన్నమరెడ్డిపల్లికి చెందిన చోడవరపు కోటేశ్వరరావుకు సోమవారం కృత్రిమ కాళ్లను ఆయన చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, వ్యాపారవేత్త గజ్జల వెంకటేశ్వరరావు, దాతల తరపున విశ్రాంత ఉపాధ్యాయిని లాగిశెట్టి ద్రాక్షాయని, హీల్ సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్, సీనియర్ టెక్నిషియన్ కె.చిన్నా పాల్గొన్నారు.



వికలాంగులకు కృత్రిమ అవయవాలను అందజేసిన దాతలు

ఆర్థిక సాయం అందజేత

ఏ.కొండూరు: పీఏసీఎస్ పరిధిలో అనారోగ్యంతో లేదా ప్రమాదాల వల్ల సంఘ సభ్యులు అకాలంగా మృతి చెందితే సహకార సంఘం తక్షణ ఆర్థిక సాయం అందిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ గుర్రాల వెంకట్రావు తెలిపారు. మండలంలోని చీమలపాడు గ్రామానికి చెందిన బెజవాడ వెంకటేశ్వరరావు(65) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మృతుడి కుటుంబానికి సహకార సంఘం రూ.10వేల సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ వి. కుటుంబరావు, సర్పంచ్ మోర్ల లక్ష్మి, జెడ్పీటీసీ భూక్యా గనియా, ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బెజవాడ నాగకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు మోర్ల సాంబశివరావు, వెంకట్ నారాయణ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రావు

ఎల్బీఆర్సీఈ విద్యార్థుల ప్రతిభ

మైలవరం: సిల్వర్ జూబిలీ వేడుకల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు వివిధ రంగాలలో తమ ప్రతిభ కనబర్చి బహుమతులు గెలుచుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో సిల్వర్ జూబిలీ వేడుకలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కల్చరల్ ఈవెంట్స్ పోటీలలో 22 మంది విద్యార్థులు పాల్గొని రెండు విభాగాలలో తమ ప్రతిభను కనబర్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఫ్లూట్, మదర్ ఎమోషనల్ సాంగ్ పోటీలలో కే. సాగర్ ద్వితీయ స్థానంలో గెలుపొందగా స్కిట్ విభాగంలో నేషనల్ ఇంటిగ్రేషన్ కాన్సెప్ట్‌లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రూ.8000 బహుమతి కైవశం చేసుకున్నారన్నారు. గెలుపొందిన విద్యార్థులను ఆయా విభాగపు విభాగాధిపతులను, కల్చరల్ కో–ఆర్డినేటర్లు డాక్టర్ ఏ ఆదిశేషారెడ్డి, డాక్టర్ టి.సత్యనారాయణను ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు అభినందించారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, అధ్యాపకులు

అన్నసమారాధన

చాట్రాయి: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పోలవరం గ్రామంలో సోమవారం రెండు వేల మందికి అన్నదానం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ చెలికాని అనూషా, జెడ్పీటీసీ సభ్యుడు బాబ్జీ అన్నసమారాధన కార్యక్రమాన్ని తొలుత ప్రారంభించారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: గంపలగూడెం గాంధీసెంటర్ వద్ద ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి నవరాత్రి శిబిరం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. మందుగా వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు నేరెళ్ల శ్రీకాంత్, బొడ్డు నరసింహారావు, నాగుబండి కుమార్, కోరుకొండ రాంబాబు, చారుగుండ్ల హనుమంతరావు తగిన ఏర్పాటు చేశారు. తోటమూల వై–జంక్షన్ వద్ద అన్నదానం చేసినట్లు కమిటీ సభ్యులు వివరించారు.



గంపలగూడెం గాంధీసెంటర్ వద్ద అన్నదానం

ముత్యాలమ్మ ఆలయానికి విరాళం

తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ ఆలయానికి మకర తోరణం నిమిత్తం ఒక దాత రూ.25వేల విరాళం అందజేశారు. తిరువూరుకు చెందిన పీతా సత్యనారాయణ వరప్రసాద్ ఈ విరాళం సొమ్మును ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

